సమస్యల పరిష్కారానికే సంక్షేమయాత్ర

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- 6వ రోజు ప్రజా సంక్షేమయాత్ర




చందనలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు, సంక్షేమ పాదయాత్రకు తరలివచ్చిన కార్యకర్తలు

యాడికి: తాడిపత్రి నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటిని పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ప్రజా సంక్షేమయాత్రకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ఆదివారం 6వ రోజు ప్రజా సంక్షేమ యాత్ర రాయలచెరువులో ప్రారంభమై చందన, పచ్చారుమేకల పల్లె మీదుగా పెద్దపేట వరకు సాగింది. పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు మండలం నుంచే గాక పెద్ద వడుగూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి మండలాల నుండి భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. యాత్ర రాయలచెరువు నుంచి చందనకు పోయే రహదారిలో వ్యవసాయ కూలీలను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. యాత్ర చందనకు సమీపించగానే ఎంపీటీసీ సభ్యురాలు రాగుల పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, ఆదిరరం గారెడ్డి, శివకేశవ రెడ్డి, నాగరాజు యాదవ్, డీలర్ రామాంజనేయులు, మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఎమ్మెల్యేకు హారతి ఇచ్చి శాలువాలు, పూలదండలతో ఘన స్వాగతం పలికారు. గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు ఏర్పాటు చేసిన అల్పాహార విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం యాత్ర పచ్చారుమేకల పల్లె సమీపంలోకి వస్తుండగా ఎంఆర్‌పీఎస్ నాయకుడు ఆది, నాగరాజు ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ వాసులు ఎమ్మెల్యేను శాలువాలు పూలదండలతో సత్కరించారు. అనంతరం యాత్ర పొలాల వెంబడి పెద్దపేటకు చేరుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణారెడ్డి, యాడికి 18వ వార్డు సభ్యురాలు లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మహిళా నేత లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున వచ్చి ఎమ్మెల్యేకు గుమ్మడికాయతో దిష్టి తీశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయలచెరువు, యాడికి కాలువకు నీరులేక లక్షలు ఖర్చు పెట్టి బోర్లు వేయించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక వర్షాలు కురవడంతో రాయలచెరువు చెరువుకు, యాడికి కాలువకు నీరు ఇచ్చామన్నారు. దీంతో భూగర్భ జలాలు పెరిగాయన్నారు. రైతులు పంటలు పండించుకుని సుభిక్షంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలతా రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథ రెడ్డి, లక్ష్ముంపల్లె, తూట్రాళ్లపల్లె సర్పంచులు పద్మానాభరెడ్డి, సంజీవ రాయుడు, కొట్టే వెంకట రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, శాంతారెడ్డి, గుడిపాడు వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ చలమారెడ్డి, కోనా జగదీశ్వర రెడ్డి, తలారి నాగేష్, రషీద్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాశం రంగస్వామి యాదవ్, పెద్దవడుగూరు మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, నాయకులు వెంకటస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యాడికిలో బహిరంగ సభ

సోమవారం పెద్దపేట గ్రామం నుంచి మండల కేంద్రంలో వైఎస్సార్ సర్కిల్ వరకు సంక్షేమ యాత్ర సాగనుంది. వైఎస్సార్ సర్కిల్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

పోలీస్ పికెట్ పరిశీలన

పుట్లూరు: శనగలగూడూరులో ఏర్పాటు చేసిన పోలీస్‌పికెట్‌ను ఎస్‌ఐ దిలీప్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం తాడిపత్రి–పుట్లూరు రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు.

పంచాయతీ కార్యాలయానికి కొత్త కళ



అందంగా తయారైన పంచాయతీ కార్యాలయం

పామిడి: స్థానిక పంచాయితీ కార్యాలయానికి కొత్త కళ వచ్చింది. ఎంపీడీఓ డీ ప్రభాకర్ నాయక్, ఈఓఆర్డీ బీవీ శశికళ పర్యవేక్షణలో ఈఓ పీ చంద్రశేఖర్ పంచాయతీ కార్యాలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. కార్యాలయంలో ఉన్న అడ్డుగా ఉన్న కట్ట తొలగించారు. ఒక భాగంలో మొక్కలు, మరో భాగంలో కార్యాలయ గదులకు వెళ్లేందుకు దారులు ఏర్పాటు చేశారు. జాతిపిత గాంధీజీ విగ్రహాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బంది వార్డులోని డ్రైనేజీలు శుభ్రం చేశారు. చెత్తా చెదారాన్ని తొలగించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

శ్రీ కృష్ణ మందిరానికి చిత్రపటం వితరణ



ఆలయ కమిటీ సభ్యులకు చిత్రపటం అందజేస్తున్న దాత

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిరానికి చిత్రపటాన్ని ఓ భక్తుడు వితరణ చేశాడు. ఆదివారం గ్రామంలోని శ్రీకృష్ణ మందిరంలో జరిగిన కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన నంజుండయ్య అనే భక్తుడు రూ.20 వేలు విలువ చేసే శ్రీకృష్ణుని చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కోనేటి గోవిందు, యాదవ సంక్షేమ సంఘం నాయకుడు ఏకాంతమయ్య పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా అర్చకులు ఉదయం గణపతి పూజ నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ట, అభిషేకం, పూజలు ఉంటాయని వాల్మీకి సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని వాల్మీకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఇదిలా ఉండగా వాల్మీకి విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరుకానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



వాహనం తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బుక్కరాయసముద్రం: వాహన దారులు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సీఐ నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అనంతపురం తాడిపత్రి రహదారిపై సీఐ నాగర్జునరెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అతివేగం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిన వాహనదారులకు జరిమానా విధించారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. గుంతకల్లులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కరిడికొండ సర్పంచ్ కర్లకుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు ముగ్గు చిక్కాల జమ్మన్నతో పాటుగా 20 కుటుంబాలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్న పథకాలు, ఎమ్మెల్యే వైవీఆర్ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా టీడీపీ నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో చిక్కాల పుల్లయ్య, తాటికొండ లక్ష్మన్న, రామాంజనేయ, పెద్ద బాలయ్య, టి.బాలయ్య, లక్ష్మన్న, టి.లక్ష్మయ్య రామాంజనేయులు, ఎ.జాషువా, టి.మహేష్, టి.విజయ్, టి.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

భైక్‌పై నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఓనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన ప్రేమ్ కుమార్ గుంతకల్లులో జరిగే బంధువుల వివాహ వేడుకకు బైక్‌పై బయలుదేరాడు. అయితే రజాపురం గ్రామ సమీపంలో గురుకుల పాఠశాల ఎదురుగా వేగంగా వెళ్తున్న ప్రేమ్‌కుమార్ మట్టి కుప్పను ఢీ కొట్టి బైకు అదుపుతప్పి కిందపడ్డాడడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రేమ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సం(ద)డే సందడి

- పిల్లలతో నిండిపోయిన పార్కులు



పార్కులో ఆటల్లో నిమగ్నమైన చిన్నారులు



ఓపెన్ జిమ్ పరికరాలపై వ్యాయామం

తాడిపత్రి: ఆదివారం సెలవు రోజు. పిల్లా పెద్దలు అందరూ ఇంటి వద్ద ఉండి సంతోషంగా గడిపే రోజు. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు సమీపంలోని వారు సరదాగా పార్కులకు వెళ్తుంటారు. తాడిపత్రి ప్రాంతంలో ఆదివారం పార్కులన్నీ నిండిపోతున్నాయి. సజ్జలదిన్నె సమీపంలో పెన్నానది ఒడ్డున ఏర్పాటు చేసిన వైఎస్సార్ గ్రామీణ పార్కు, నూతన బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన పార్కులు పిల్లలను ఆహ్లాదకర వాతావరణంతో ఆకట్టుకుంటున్నాయి. వ్యాయామ పరికరాలు, ఆట వస్తువులతో పిల్లలు, పెద్దలు సేద తీరుతున్నారు. ఇక సజ్జలదిన్నె వద్ద పార్కు పెన్నానది పక్కనే ఉంది. అక్కడ నదిలో నీరు పారుతుండడంతో ఓ మంచి అనుభూతి పొందుతున్నారు.

చంద్రబాబు, లోకేష్‌పై చర్యలు తీసుకోండి



ఏఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సోషల్ మీడియా ప్రతినిధులు

పుట్లూరు: టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తున్న చంద్రబాబు, లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు ఏఎస్‌ఐ హనుమంతుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ మారుతి, కో కన్వీనర్ సాయి, జయకాంత్, మండల కన్వీనర్ నాగేశ్వరావు, యూత్ నేత దినేష్‌రెడ్డి మాట్లాడుతూ 2024లో తమ పార్టీని అధికారంలోకి తీసుకరావాలనే ఉద్దేశంతో చంద్రబాబు, లోకేషులు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఎక్కువ కేసులు ఉంటే నామినేటెడ్ పదవులు ఇస్తామని ఆశ చూపి మరీ అల్లర్లు సృష్టించడానికి ప్రేరేపిస్తున్నారన్నారు. భవిష్యత్తులో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన చెస్ చాంపియన్‌షిప్ పోటీలు



గెలుపొందిన చెస్ క్రీడాకారులు

అనంతపురం: నగరంలో కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–15 ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్ షిప్–2023 పోటీలు ఆదివారంతో ముగిశాయి. స్విస్ లీగ్ పద్ధతిలో మొత్తం 8 రౌండ్ల పోటీలు నిర్వహించారు. అందులో 8/8 పాయింట్లతో చాంపియన్ షిప్ టైటిల్‌ను విజయవాడకు చెందిన ఫిడే మాస్టర్ యండి ఇమ్రాన్ (క్లాసికల్ రేటింగ్ 2197) సాధించాడు. రన్నరప్‌గా అనంతపురం జిల్లాకు చెందిన శామ్యూల్ స్టీఫెన్ నోబెల్ 7/8 పాయింట్లు సాధించాడు. మూడో స్థానం తూర్పుగోదావరికి చెందిన రామ్‌చరణ్‌తేజ 6.5/8 పాయింట్లు సాధించాడు. 4వ స్థానం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సీతాసాగర్ 6.5/8 పాయింట్లు సాధించాడు. ప్రతిభ చూపినవారికి 32 నగదు బహుమతులు అందించారు. టాప్ 4 క్రీడాకారులను రాష్ట్రం తరపున జాతీయ స్థాయి అండర్ 15 ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేసినట్లు టోర్నీ ఆర్గనైజర్ శ్రావణ్‌కుమార్, అసోషియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవ చైర్మన్ బాలరాజు తెలిపారు. విజేతలకు ప్రిన్సిపాల్ శంకరయ్య, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాంతి భరత్, జీవన్‌కుమార్ బహుమతులు అందించారు.

పూర్వ విద్యార్థుల తోడ్పాటు అభినందనీయం

- జేఎన్‌టీయూ వీసీ జింకా రంగ జనార్దన

అనంతపురం : జేఎన్‌టీయూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు అభినందనీయమని వీసీ జింకా రంగ జనార్దన తెలిపారు. ఆదివారం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో 1994– 98 బ్యాచ్ విద్యార్థులు కళాశాలను సందర్శించారు. మెకానికల్ సెమినార్ హాలులో పూర్వ విద్యార్థులు సమావేశమై, ఉపకులపతి ఆచార్య రంగ జనార్దనతో ఆన్‌లైన్ ద్వారా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఎంతో గొప్ప హోదాల్లో ఉన్నారని, కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య శశిధర్ మాట్లాడుతూ కళాశాలకు అల్యూమినీ అసోషియేషన్ బలం అని, యూనివర్సిటీ అభివృద్ధికి వీరి సలహాలు ఎల్లప్పుడూ తీసుకుంటామన్నారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ హరినాథ్‌రెడ్డి, శివరామిరెడ్డి (లండన్), డాక్టర్ ఎం. నాగమణి (హైదరాబాద్), ఓబుల్‌రెడ్డి (మైక్రోసాఫ్ట్ కంపెనీ, పూణే), మనోహర్‌రెడ్డి (ఎంవీఐ), శ్రీనివాసులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

గుత్తి: సత్యసాయి వాటర్ పథకం కార్మికులు సమ్మెలో ఉండటంతో తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే మున్సిపల్ బోర్లు, వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..తాడిపత్రిలోని హరిజనవాడకు చెందిన భగీరథ తాడిపత్రి రోడ్డుపై బైక్‌లో వెళ్లుండగా ఎదురుగా మరో బైక వచ్చి ఢీకొంది. ఘటనలో భగీరథకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు ‘స్పందన’

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుమతి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని సూచించారు.

బుక్కరాయసముద్రం: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. మండల ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వాలన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

రాయితీతో గడ్డి కోసే యంత్రం

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం పాడి పశువుల పెంపకం చేసే రైతులకు రాయితీతో గడ్డి కోసే యంత్రం అందిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రత్న కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పాడి రైతులకు గడ్డిని కోసే చాఫ్ కట్టర్స్ 2 హెచ్‌పీ పవర్ బ్లేడ్‌తో ఉన్న యంత్రం పూర్తి ధర 33,972 ఉండగా సబ్సిడీ రూ.13,588 పోను రైతు వాటాగా రూ.20,382 చెల్లించాల్సి ఉంటుంది పేర్కొన్నారు. ఈ యంత్రం ద్వారా గడ్డిని చిన్న ముక్కలుగా కత్తిరించి పశువులకు వేసినట్లతే 40 శాతం పశుగ్రాస వృథాను అరికట్టవచ్చని తెలిపారు. యంత్రం కావాలసిన రైతులు 9440126869 నంబర్ లేదా మండల వెటర్నీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సుంకప్పకు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకున్న సుంకప్ప

గుంతకల్లు: ఆలిండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి సుంకప్పకు గౌరవ డాక్టరేట్ లభించింది. సుంకప్ప రైల్వే రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సామాజిక సేవలకుగాను రాజస్థాన్‌కు చెందిన సన్‌రైజ్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. విశాఖపట్నం చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ, చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం గోవాలో జరిగిన కార్యక్రమంలో సుంకప్పకు డాక్టరేట్‌ను అందజేశారు.

జింక మృతి

పెద్దవడుగూరు: మండల కేంద్రం సమీపంలో వ్యవసాయం పొలంలో జింక మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. వివరాలు.. శర్మ అనే రైతు పొలంలో కుక్కలు పీక్కొని తింటుండగా సమీపంలోని పొలాల రైతులు వెళ్లి చూడగా జింక మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులకు తెలియడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుక్కలు దాడిలో జింక మృతి చెంది ఉండొచ్చని అటవీ అధికారులు తెలిపారు. జింక కళేబరాన్ని పామిడికి తరలించారు.

మూగజీవాలకు రక్ష

సత్ఫలితాలిస్తున్న పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

- నియోజకవర్గంలోని 4,995 పశువులకు పరీక్షలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న పశు యజమానులు

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గం కేంద్రంలో ఏర్పాటు చేసిన పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సత్ఫలితాలనిస్తోంది. లక్షలు ఖర్చు చేసి పెంచుకుంటున్న పశువులు అనారోగ్యానికి గురైతే పశు యజమానులు పడే ఆందోళన అంతాఇంతా కాదు. వారి సమస్యలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నియోజకవర్గ కేంద్రంలో పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏర్పాటు చేయించడం ద్వారా పశుయజమానులకు అండగా నిలుస్తున్నారు. మరోవైపు టోల్‌ఫ్రీ నంబరు 1962 ద్వారా పశు అంబులెన్స్ ద్వారా పశుయజమానులకు సేవలందిస్తున్నారు.

జబ్బు తెలుసుకుని చికిత్స..

పశువుల్లో వచ్చే జబ్బులకు గతంలో వ్యాధి లక్షణాలు బట్టి చికిత్స అందించేవారు. అయితే ఒక్కోసారి జబ్బు ఏదనేది ఖచ్చితంగా తెలియకపోవడంతో చికిత్స ఫలించేదికాదు. ఫలితంగా పశు మరణాలు సంభవించిన ఘటనలున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతుల సమస్యలను గుర్తించి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగాశాలలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 2021 జూలై 9న డాక్టర్. వైఎస్సార్ నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ప్రారంభించారు. ఈ ప్రయోగశాల ద్వారా పశువులకు సంబంధించిన పేడ, రక్త నమూనాలు, నాసిక ద్రవాలు, చర్మం, మూత్రం, పాలు తదితర వాటి నమూనాలు సేకరించి వ్యాధిని తెలుసుకుంటున్నారు. కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకూ 4,995 పశువులకు సంబంధించిన నమూనాలకు పరీక్షలు చేసి వ్యాధిని గుర్తించారు. పశువుల వ్యాధి నిర్ధారణ అవుతుండటంతో రైతులు తమ పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నారు.



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బాబావలి. గార్లదిన్నెకు చెందిన ఇతడికి బండలాగుడు పోటీలంటే ఇష్టం. దీంతో రూ.5 లక్షలు పెట్టి జత కోడెదూడలు కొనుగోలు చేశాడు. నెల రోజులకే ఒక కోడె అనారోగ్యానికి గురైంది. పశువైద్యుడు రమేష్‌ను సంప్రదించగా యూరిన్ శ్యాంపిల్స్ తీసి శింగనమలలోని పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలకు పంపారు. పరీక్షల్లో తేలిన సమస్యను గుర్తించిన వైద్యుడు సరైన మందులు ఇవ్వడంతో కోడె కోలుకుంది. దీంతో బాబావలి సంతోషం వ్యక్తం చేశాడు. ఇతడే కాదు నియోజకవర్గంలోని చాలా మంది పశుయజమానులు తమ పశువులకు వివిధ పరీక్షలు చేయించడం ద్వారా వాటిని కాపాడుకుంటున్నారు.



శింగనమలలో ఏర్పాటు చేసిన పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలో చేసిన పరీక్షల వివరాలు..

సంవత్సరం	పరీక్షల సంఖ్య
2021	1,339
2022	1,925
2023	1,731

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పశువులు, గొర్రెలు, మేకల్లో వచ్చే అనారోగ్య సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలను ఏర్పాటు చేసింది. జబ్బు చేసిన పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మందులను అందిస్తాం. పశువులను తీసుకురాలేని రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1962 కు కాల్ చేస్తే, వాహనం వచ్చి తీసుకొస్తుంది. రైతులు ప్రయోగశాలను సద్వినియోగం చేసుకోవాలి. – డాక్టర్.పద్మనాభం, పశుశాఖ ఏడీ

3 నుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలు

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులో ప్రసిద్ధి చెందిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో సెప్టెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు రాజగోపుర స్థిర ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు స్వామికి మహాన్యాసపూర్వాక రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంభాభిషేకం, రుద్రాక్ష అర్చన సేవ, రామలింగేశ్వర స్వామి శాంతి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. 6వ తేదీ ఉదయం ఆలయంలో నూతనంగా నిర్మించిన రాజగోపురాన్ని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తాదులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు మస్తాన్‌వలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

గుంతకల్లుటౌన్: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన హజరత్ మస్తాన్‌వలి వారి ఉరుసు సందర్భంగా సోమవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. స్వామి వారికి స్థానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చాదర్‌ను సమర్పించునున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బి.సుంకప్ప తెలిపారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.